# గోరంతదీపం

—విమ·ఞారామం




కారు చీకటిని చీల్చుకుంటూ ఫియట్ కారు రంయ్ మంటూ దూసుకు పోతోంది. నల్లని తారు రోడ్డుమీద తెల్లని వెలుగు విరజిమ్ముతున్నాయి కారు దీపాలు.

మేఘాల మీద తేలి వెళ్ళిపోతున్నట్లుగా ఉంది కమలకు. మధ్య మధ్య రోడ్డు మీద నుంచి దృష్టి మరల్చి స్టీరింగు ముందున్న శ్యాంసుందర్ వైపు చూస్తోంది. అది గుర్తించి అతనో చిరునవ్వు విసురుతున్నాడు. అతని కిష్టమని ఆమె జుట్టు విరబోసుకుని వుంది. కిటికీలోంచి దూసుకు వచ్చేగాలికి ఆమె శిరోజాలు సెలయేటి కెరటాల్లా తేలియాడుతూ అతని భుజంతో దోబూచు లాడుతున్నాయి. జుట్టు చివళ్ళు అతని మెడ వరకు చేరి కితకితలు పెడుతున్నాయి!

"ఇంకెంత దూరం?" అని ఆమె అడిగింది.

అప్పుడే వెనక్కి దూసుకు పోయిన మైలురాయిని చూసి "తొంభయి కిలో మీటర్లు!.... అంటే మరో గంటన్నర పడు తుంది!" అన్నాడతను.

అతని మాటలు పూర్తయ్యాయో లేదో వెనకనుంచి ఠాప్‌మని శబ్దం వచ్చింది. అప్రయత్నంగా ఆక్సి లేటరు రిలీజ్ చేసి సడన్ బ్రేకు వేసాడతను. రోడ్డుమీద అటూ యిటూ అడ్డదిడ్డంగా తిరిగి ఒక పెద్ద కుదుపుతో ఆగింది కారు. అదృష్టవశాత్తు అక్కడ రోడ్డు విశాలంగా ఉంది.

"మైగాడ్!...." అన్నాడు అతను తలపట్టుకుంటూ.

"ఏమయిందండీ!" అని అడి గింది ఆమె కంగారుగా.

అతను జవాబు చెప్పకుండా కారుదిగి క్రిందకి వెళ్ళాడు. ఒళ్ళో నిద్రపోతున్న చంటివాడిని సీటు మీద పడుకోబెట్టి ఆమె అటువైపు డోరు తెరచుకుని క్రిందకి దిగింది.

కారు వెనుక ఎర్ర దీపాల వెలుగులో శ్యాంసుందర్ ముఖం మరంత ఎర్రగా కనిపించింది. ఆమె మళ్ళీ అడిగేదానికి ముందే, "ఇంకో టైరు పంక్చరయింది!" అన్నాడు అతను ఉస్సురుమంటూ.

ఆమె గుండె ఝల్లుమంది. "ఇప్పు డెలాగండీ...." అంది చుట్టూ వున్న చిక్కని చీకటిని చూసి భయంతో కంపించి పోతూ.

అతనికేమని జవాబు చెప్పాలో తోచలేదు. రోడ్డు కటూ యిటూ చూసాడు. ఎక్కడా దీపమన్నది కనిపించటం లేదు. మిణుగురులు కూడా కనపడకుండా పోయాయి. ఎక్కడో పక్షుల అరుపులు.... గాలికి వూగులాడుతూ చెట్ల కొమ్మలు చేసే చప్పుడు....భయ పెట్టేలా ఉన్నాయి పరిసరాలు. పట్నంలో బిజీ లొకాలిటీలో ఉండే వాళ్ళకి ఈచోటు చిట్టడవని అని పించటంలో ఆశ్చర్యం లేదు.

అనుకున్న ప్రకారం అంతా సవ్యంగా జరిగివుంటే వాళ్ళు సాయంత్రం ఆరింటికే గమ్యంచేరి వుండాల్సింది. కాని, దార్లో ముందు టయిరు పంక్చరయింది. వీల్ మార్చటానికి గంట పట్టింది. ఆ తర్వాత మధ్యలో టిఫిను చేయ టానికి టౌన్‌లో అరగంట ఆలస్య మయింది. టైర్ రిపేర్ చేయించే విషయం ఆమె గుర్తు చేసినా, "మరో గంట ఆలస్యమవుతుంది కమలా!, ఆ గంటలో మనమింటికి చాల దగ్గరయి పోతాం... మీ అన్నయ్య వాళ్ళూ ఎదురు చూస్తుం టారు కూడాను" అన్నాడతను.

ఆమె మాట్లాడ లేదు. మరి కాసేపట్లో ఇంత ప్రమాదం ముంచుకు వస్తుందని ఇద్దరూ ఊహించ లేదు. ప్రయాణమయిన అరగంటలోనే వాళ్ళ తియ్యని వ్యూహాలన్నీ పటా పంచలయి పోయాయి. అత్తవారింట అతనికి, పుట్టింట ఆమెకు ఆ రాత్రి అంద బోయే ఆనందం లిప్తకాలంలో హరించిపోయింది.

"ఒకేసారి రెండూ పంక్చ రవటం! బేడ్‌లక్! స్పేరు లేకుండా రిస్క్ తీసుకు బయల్దేరటం చాలా పొరపాటయింది. కనీసం, నువ్వు చెప్పినప్పుడయినా అది రిపేరు చేయించి వుంటే బావుండి పోయేది. ఓ గంట కల్సి వస్తుం దనుకున్నాను. ఇప్పుడీ అడివిలో ఎన్ని గంటలు పడివుండాలో తెలి యదు!" అన్నాడుతను నిరుత్సా హంగా.

అతని మాటలతో ఆమె భయం మరింత ఎక్కువయింది. "అంటే రాత్రంతా యిక్కడే గడపాలా?" అన్నది అతనికి దగ్గరగా వస్తూ.

ఆమెను దగ్గరగా తీసుకొని నెర్వస్‌గా నవ్వాడు అతను. "చూడు కమాలా! అనవసరంగా కంగారు పడకు. ఇలా జరుగుతుందని మన మనుకున్నామా? అనుకోని ప్రోబ్లమ్స్ వచ్చినప్పుడే మనం ధైర్యంగా ఉండాలి!"

ఇంతలో కారులో పడుకున్న పిల్లవాడు లేచి ఏడ్వటం మొదలు పెట్టాడు. కమల పరుగెత్తుకు వెళ్ళి చంటివాడ్ని ఒడిలోకి తీసుకుంది. కారు హెడ్ లైట్సు ఆఫ్‌చేసి లోపలి లైటు వేసాడు శ్యాం సుందర్.

ప్లాస్కులోని పాలు తీసి సీసాలో పోసి పిల్లవాడికి పట్టి స్తోంది కమల.

"అవేనా పాలు?" అని అడి గాడు అతను.

"ఇంకొంచెం ఉన్నాయి" అంది ఆమె.

"అయినా, ఈ రాత్రంతా ఇక్కడుంటే చాలవు.... ఎలా గోలా యింటికి చేరాలి!"

అంతలో వెనక వైపు నుంచి వచ్చే కారు లైట్లు కనిపించాయి.

"ఏదో కారు వస్తోంది కమలా! పోనీ బాబును తీసుకొని నువ్వు దాంట్లో వెళ్ళిపో! నేను తర్వాత వస్తాను."

"ఊహూఁ! ఎవరో తెలియని వాళ్ళతో వెళ్ళటమా! వద్దు బాబూ! అంతకన్నా యిక్కడే మీ దగ్గరే ఉండటం నయం!"

ఆమె ముఖం చూసి అతను

నవ్వాడు. "పిచ్చి కమలా! లోకంలో అంతా దుర్మార్గులే ఉంటారా?"

"ఎవడెలాంటివాడో ముఖం చూసి ఎలా చెప్పగలం?"

"ఆడవాళ్ళు కూడా వున్న కార్లో ఎక్కిస్తాను. సరేనా!"

"ఏమయినా సరే, తెలియని వాళ్ళతో వెళ్ళటం నాకిష్టంలేదండీ!"

"మనం వూరికి దూరంగా ఉన్నాము. ఈ రోడ్ మీద తెలిసిన వాళ్ళెలా కనిపిస్తారు? నువ్వూ నేనూ అంతే అన్నం మానేసి ఉండగలం! మరి బాబు కాక లేస్తే ఎలా? నువ్వేదో ఒక వూరు చేరటం చాలా అవసరం. ఆ కారు వస్తోంది. త్వరగా దిగు కమలా." అని అతను క్రిందికి దిగి ఆ కారు నాపటానికి చెయ్యి వూపసాగాడు.

దడదడలాడే గుండెలతో అలాగే కూర్చుండి పోయింది కమల. మరో నిముషంలో ఆ కారు ఆగింది. దాన్నిండా జనం కిక్కిరిసి వున్నారు.

వాళ్ళేం కావాలని అడిగారు. తన పరిస్థితిచెప్పాడు శ్యాంసుందర్. టైరు రిపేరుకయితే మళ్ళీ వెనక్కి టౌన్‌కి వెళ్ళవల్సిందేనని చెప్పాడు కార్లోని మనిషి.

"ముందు నా మిసెస్‌ని పిల్ల వాడ్ని దగ్గర వూరుకి చేర్చాలి.... ఇక్కడ దగ్గర్లో ఏదయినా ట్రావెలర్స్ బంగళా వుందేమో చెప్ప గలరా!" అని అడిగాడు శ్యాం సుందర్.

అక్కడికి ఎనిమిది మైళ్ళ దూరంలో రామవరం వుందని, ఆ వూళ్ళో ట్రావెలర్స్ బంగళావుందని వాళ్ళు చెప్పారు. అతనడక్క పోయినా తమ కారులో ఖాళీ లేని సంగతి చూసారు కదా అని చెప్పి వెళ్ళిపోయారు.

కమలతో రామవరం సంగతి చెప్పి, ఏదో ఒక కారులో ఆమెను పంపుతానని, రాత్రికా బంగళాలో వుండమని చెప్పాడు అతను.

"ఊహూం! ఎవరి కారూ మనకి వద్దు. మీరూ రండి.... నడిచి పోదాము!" అంది కమల.

"యూపిల్లీ! ఇదేమన్నా మన కాంపౌండులో నడవటమను కున్నావా? ఎనిమిది మైళ్ళు నడవాలి. అదీకాక తెల్లారేలోగా ఈ కారు సంగతి చూడద్దూ? ఏ లారీలోనో వీల్ వేయించి తీసుకు వెళ్ళి రిపేరు చేయిస్తాను. నువ్విక్కడుండే విన్నాంటరిగా వదలి వెళ్ళలేను కదా! నువ్వా వూరు వెడితే హాయిగా ఆ బంగళాలో రెస్టు తీసుకోవచ్చు. నా పనికీ వీలవుతుంది. అక్కడ వాచ్‌మన్ ఉంటాడు. బాబుకి పాలు

తెప్పించు. 'నీకేదయినా పళ్ళు అదీ తెప్పించుకో! మరీ అర్ధరాత్రికి వెడితే ఏవీ దొరకవు. నేనీపనయి పోయిన వెంటనే వచ్చేస్తాను. ఓకే"

"నాకేదో భయంగా వుందండీ! మిమ్మల్ని వదిలి వెళ్ళలేను బాబూ!"

"చూడు కమలా! ఇప్పుడు కాకపోతే రేపు ప్రొద్దున్నయినా నేను టయిరు బాగు చేయించి తేవాలి! అదే చూసుకోనా.... నీ సంగతీ, బాబు సంగతీ చూడనా? నేనయితే ఏ లారీలోనో ఎక్కేసి ఎలాగో వెడతాను. మరి నువ్వెలా రాగలవ్? అందుకే మరీ ప్రొద్దు పోకుండా ఆ ఊరు చేరితే మంచిది. దేవి మామెలా వున్నా ముందు వాడికి పాలు కావాలి కదా! అఫ్ట్రాల్! అక్కడా మనుషులే ఉన్నారు. ఈ అడివికన్న అది నయం!"

"మీరు కూడా వుంటే ధైర్యంగా ఉంటుందండీ!"

"నేను లేనప్పుడు ధైర్యంగా ఉండటమే గొప్ప!" అని పరిహాసంగా నవ్వాడతను.

ఇంతలో మళ్ళీ వెనక వైపు లైట్లు కనిపించాయి. భార్యను సిద్ధంగా ఉండమని హెచ్చరించి క్రిందకి దిగాడు శ్యాంసుందర్. మునిగిపోతున్న పడవలోంచి నీళ్ళల్లోకి దూకటానికి సిద్ధంగా ఉండమని అతను చెపుతున్నట్టుగా వుంది ఆమెకు! పిల్లవాడికి షాల్ కప్పి ఎత్తుకుంది. తన వేనిటీ బ్యాగ్ తీసుకుంది.

వస్తున్నది కారు కాదు బస్సని, అదయితే తిన్నగా ఆమె తమ ఊరే వెళ్ళిపోవచ్చని అన్నాడతను. కాని, అతని ఆశ ఫలించలేదు. బస్సు ఆగాక రెండు ముక్కల్లో కండక్టరుకి తన సంగతి చెప్పాడు శ్యాంసుందర్. బస్సు రూటు మధ్యలో మారుతుందని, కావాలంటే రామవరంలో ఆమెను దించేస్తానన్నాడు కండక్టరు. అందుకే సంతోషపడ్డాడు శ్యాంసుందర్. ట్రావెలెర్స్ బంగళాకి వెళ్ళమంటూ అతనింకా ఏదో భార్యకి చెపుతూనే ఉన్నాడు, కండక్టరు ఈలవేసాడు. బస్సు బయలుదేరింది.

బస్సులో అందరి దృష్టి తన మీద పడేసరికి కమలకి సిగ్గు ముంచుకు వచ్చింది. అంతా పల్లెటూరి జనం! ఏదో వింత చూస్తున్నట్టు తన వైపే కళ్ళు పెట్టుకు చూస్తున్నారు. తలదించుకుని ఆలోచనల్లో పడిపోయింది ఆమె.

కొన్ని నిముషాల క్రితం కారు చీకటిలో అడవిలాంటి చోటవుంది. ఇప్పుడు మనుషుల మధ్య వుంది. కొంత భయం తగ్గింది. కాని,

అంతలోనే భర్త ఒంటరిగా చీకటిలో ఉండిపోయినందుకు దిగులు కలిగింది. అతని మీద ఆలోచనలలో పడిపోయి బస్సు రామవరం చేరిందని కూడా ఆమె గుర్తించ లేదు. కండక్టరు కేకపెట్టి ఆమెకు చెప్పాడు. కంగారు కంగారుగా బస్సు దిగేసింది కమల।

బస్సు వెళ్ళిపోయింది. రోడ్డు మీద అంతా చీకటి. అటూ యిటూ కొన్ని గుడిసెలున్నాయని కూడా కమల వెంటనే గుర్తించలేక పోయింది. బస్సులో ఉన్నప్పుడు తను మనుష్యుల మధ్య వున్నానని కొంత ధైర్యంతో ఉంది. అది పావుగంట మాత్రమే। ఇప్పుడు మరో అడివిలోకి వచ్చి పడింది. అక్కడ భర్త వున్నాడన్న భరోసా ఉంది. ఇక్కడ తానొక్కతే। పట్నంలో అయిన వాళ్ళంతా ఉన్నారు. తన కే లోటూ లేదు. నోరు విప్పి అడగటం తరువాయి, అన్నీ కాళ్ళ దగ్గరికి వస్తాయి. ఒక గంట క్రితం విమానంలో వెళ్ళి పోతున్నంత హాయిగా కారులో ప్రయాణం చేస్తోంది. ఇప్పుడు చిమ్మ చీకటిలో తెలియని చోట.... ఒంటరిగా నిస్సహాయంగా నిలబడి వుంది। జీవితం ఎంత చిత్రమైంది। మరి కాసేపట్లో ఏమవుతుందో ఎవ్వరూ ఊహించలేరు।

ఆమె అలా నిలబడింది రెండు మూడు నిమిషాలు మాత్రమే। ఆమె కవే ఎన్నో యుగాలని పించాయి.

అంతలో రోడ్డు కిరువైపుల వున్న గుడిసెల్లో మినుకు మినుకు మని దీపాలు వెలుగుతున్నాయని గుర్తించింది ఆమె. అక్కడ నుంచి మనుషుల మాటలు కూడా లీలగా వినిపిస్తున్నాయి।

కొంత భయం తగ్గింది. అటు వైపు గబగబా అడుగులు వేసింది.

అది పాక. అందులో ముందు బడ్డీ కొట్టు వుంది. వెదురుగుంజకు చిన్న దీపం వ్రేలాడుతోంది. చుట్ట కాల్చుకుంటూ బల్లమీద పడుకున్న ముసలివాడు తటపటాయిస్తూ తన పాక ముందు నిలబడిన కమలని చూసి లేచి వచ్చాడు।

"ఇది రామవరమేనా బాబూ!" అని అడిగింది కమల.

"అవునమ్మా। ఎవరింటికి వెళ్ళాలి?" అని అడిగాడు ముసలి వాడు తెల్లబోయి చూస్తూ.

కమల క్లుప్తంగా తన పరిస్థితి చెప్పింది.

"అయ్యో! ఇప్పుడాడ కెట్టా గెల్తావమ్మా!"

"ఏం? దూరమా?" అని ఆత్రుతగా అడిగింది కమల.

ఆమధ్య విపరీతమైన వర్షాలు కురిపి పై కప్పు కూలిపోయిందని, ప్రస్తుతం బంగళా బాగుచేస్తున్నారని, అక్కడ అడుగు పెట్టటానికే చోటులేదని చెప్పాడు ముసలివాడు.

కమలకి ప్రాణం ఉస్సూరుమంది. ఈవేళ అదేం దురదృష్టమో అన్నీ చుక్కెదురవుతున్నాయి. అనుకోని సమస్యలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలంటాడు భర్త! ఇప్పుడింకేం ధైర్యం? 'అక్కడ బంగళా..అందులో వెచ్చటి పక్క, అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఇక నువ్వు వెళ్ళి హాయిగా పడుకోవటమే తరువాయి.' అన్నట్టు తరిమి తరిమి తనని పంపించాడు. కాని, ఇక్కడ ఇప్పుడు కూర్చోటానిక్కూడా చోటులేదు. తన యీ నిస్సహాయ స్థితికి భర్తే కారణమని అతనిమీద ఆమెకు కోపం వచ్చింది! అంతలోనే అతనా అడవిలో ఒంటరిగా ఉండిపోయినందుకు బాధా కలిగింది.

మతిపోయినట్లయి మాటరాక నిలబడిపోయిన కమలని చూసి, "పోనీ, ఎవారింటికయినా తీసికెళ్ళనామ్మా!" అని అడిగాడు ముసలివాడు.

ఎవరింటికని వెడుతుంది? తన పరిస్థితి ఇలా ఎందరితో చెప్పుకుంటుంది? "వద్దయ్యా! తెలియని వాళ్ళింటికి వెడితే బావుండదు," అంది ఎంతో సిగ్గుపడిపోతూ.

"పోనీ, ఈడనే నా పాకలో వుండమ్మా!...నులకమంచముంది..." అని ఆమె జవాబు కెదురు చూడకుండానే మంచం తీసుకు రావటానికి పాక వెనక్కి వెళ్ళాడు ముసలివాడు.

అప్పటికే పక్క గుడిసెల వాళ్ళెవరో ఆమెను చూసినట్టున్నారు. ఒకరినుంచి ఇంకొకరికి క్షణాలమీద వార్త తెల్సింది. కమల తెల్లబోయి చూస్తుండగానే పదిమంది జనం పోగయ్యారు.

అంత చిన్న దీపం వెలుగులో కూడ ఆమె ముఖం వింత వింతగా మెరుస్తోంది. ఏదో గగుర్పాటుతో ఆమె వొదిగి నుంచోవటంకూడ ఆకర్షణీయంగా వుంది. భయంతో కంగారుగా కదలాడే ఆ కళ్ళు మిల మిల లాడే చేప పిల్లల్లా వున్నాయి. గాలికి కదలాడే దీపశిఖ ఆమె కళ్ళ క్రింద తీరిన నీడల్ని గమ్మత్తుగా కదలాడిస్తోంది!

గుంపుగా చేరినవాళ్ళు ఆమెను

ఆపాదమస్తకం కళ్ళు పెట్టుకు చూస్తున్నారు. నిజంగా మనిషేనా? బొమ్మేమో! కాదు సినిమా స్టారు అయివుంటుంది! అంతా తలో కరకంగా అనుకుంటున్నారు. మరి ప్పుడు రాత్రివేళ యీ పల్లెటూ రెందుకు వచ్చింది? అన్న మరొకడి ప్రశ్నని పట్నంవెళ్ళి బాగా సిని మాలు చూసే విజ్ఞుడు కాటోలు-పక్క నెక్కడేనా షూటింగుకి వచ్చుంటుందన్నాడు. అబ్బ, ఎంత బావుందో-అది నిజంగటి జుట్టేనా అని అడిగింది మధ్యలో ఆ గుంపులో చేరిన పల్లెపడుచు. ఉహూ సినిమావాళ్ళు విగ్గులు పెట్టుకుం టారని, అదే అయివుంటుందని 'సినిమా పండితుడు' తన అభి ప్రాయం వెలిబుచ్చాడు. మరి సినిమా స్టారయితే డాన్సు బాగా వచ్చుంటుంది కదా! అని అతన్నే మరొకడు అడిగాడు.

ముసలివాడు పాక వెనకాల వున్న నులక మంచం తెచ్చి లోపలవేసి వచ్చేలోపల ఇంత సన్నివేశం నడిచింది పాకముందు. ఆ జనాన్ని—వాళ్ళముందు బెదురు చూపులతో వున్న కమలని చూసాడు ముసలివాడు. "ఏంటరా? ఈడ పోగయ్యా రెందుక్కు!" అని వాళ్ళని గదమా యించాడు.

"ఈయమ్మ ఎవొరు రంగయ్య మావా!" అని అడిగాడొకడు.

వూరికి దగ్గర్లో వాళ్ళ కారు పాడయిపోతే ఇక్కడ రాత్రి తల దాచుకుందామని వచ్చిందని చెప్పాడు ముసలి రంగయ్య.

ఆమె తప్పకుండా సినిమా తారేనని-ఇంక అనుమానం లేదని అందర్కీ వినిపించేలా గట్టిగా చెప్పాడు సినమా పండితుడు!

"అదురుష్టమంటే నీదే మావా!" అని గల గల నవ్వాడు మరో గడుగ్గాయి.

"నువుకూడా సినిమాలో దిగే త్తావేంటి మావో!" అని ఇంకొక డందుకున్నాడు.

అంతా ఘొల్లుమని నవ్వారు.

"నోర్మూసుకు పొండిరా!" అని అరిచాడు రంగయ్య.

"కోప్పడమోక మావా! సిని మాలో దిక్కపోతే పోయేవు. సిన్మావోల్లకాడ వేలుంటాయట. ఆయమ్మ తల్చుకుంటే నీ పాకని మేడకిందసేసి పారేద్ది తెల్సా!" అన్నాడు సినిమా పండితుడు.

"ఒకసారి డాన్సు సెయ్యమని సెప్పవా మావా!" అని ఇంకొకడు మేలమాడాడు.

"డాన్సులంటే సానా సానా

"కాయిలున్నాయిరా!" అన్నాడు సినిమా పండితుడు.

"ఏ డాన్సు బావుంటదేటి?"

"కాబ్రేయో గా బ్రా యో— అదేదో నాకు తెల్దు. యమ మజా గ్గుంటుంది. ఇట్టిట్ట వూగుతుంటే" తనూ వూగిపోతున్నాడు సినిమా పండితుడు.

"ఒరేయ్ నోరుముయ్యండిరా యెదవల్లారా!" అన్నాడు రంగయ్య కోపంగా.

"నువ్వెప్పుడూ సిన్మా సూడ నేదుమావా(! ఒక్కసారి డాన్సు సూసావో గున్మెత్తిపోద్ది. ఏం బుల్లెమ్మా! మా మావ( కోపాలి సేపిసూపించు!"

"కావాల్నంటే టికెట్ పెట్టు బుల్లెమ్మా!" అని మరొకడు అందుకున్నాడు.

చూస్తుండగా యింకా జనం పెరుగుతున్నారు. వాళ్ళ పచ్చి పచ్చి వేళాకోళాలు పెరుగుతున్నాయి. వాళ్ళ మాటలకన్నా వాళ్ళ వెకిలి నవ్వులు కమలకి జుగుప్సాకరంగా వున్నాయి. వొళ్ళు జలదరింపజేస్తున్నాయి.

ఇంతమంది జనం మధ్య తను నిస్సహాయంగా ఒక్కతె! వీళ్ళన్నంత పనిచెయ్యరు కదా! విపరీతమైన భయంతో గడగడ వణికిపోయింది కమల. మరుక్షణంలో కళ్ళు తిరిగి పడిపోతానేమో నన్నంత నిస్సత్తువ కలిగింది. కళ్ళ ముందు చిమ్మ చీకట్లు క్రమ్ముతున్నట్లుంది.

"ఒరేయ్ తాగుమోతు యెదవల్లారా! కష్టంలో ఆయమ్మ యీడకొత్తే ఎదవ కూతలు కూత్తున్నారా! బుద్ధి లేదట్రా? మీ సెల్లెల్కీయింత కట్ట మొత్తే యిట్టాగే నోరు పారేసుకుంటారట్రా! సీ!...." రంగయ్య గొంతులో బాధ, కోపం, అసహ్యం అన్నీ కలగా పులగమైపోయాయి. అతని మాటల ప్రభావమేమో- వాళ్ళకతనంటే గౌరవం ఉండటం చేతనో వెంటనే ఎవ్వరూ మాట్లాడలేదు.

ఊపిరి బిగబట్టి నిలబడిన కమలకు మళ్ళీ రంగయ్య గొంతే వినిపించింది. "ఎదవ మూక. ఏవో వాగుతుంటారు. అల్ల మాటలు పట్టించుకోమాకమ్మా! లోపలికెల్లి మంచం మీద బిడ్డని తొంగో పెట్టు...."

అటువంటి అవకాశం కోసమే చూస్తున్న దానిలా గబగబా పాకలోకి నడిచింది ఆమె. ఎప్పుడూ సుగంధ పరిమళాలతో నిండివుండే తమ గదికాని, సుతిమెత్తని తమ డన్ లప్ బెడ్ కాని, రంగు రంగుల

దీపాలుకాని ఇవేవీ కమలకి అప్పుడు గుర్తు రాలేదు. చుట్టూతా కట్టెలు, పిడకలు, ధాన్యంగింజలు, అడ్డదిడ్డంగా పడివున్నా- ఎప్పుడూ ఎరుగని ముతక వాసనలు కలగలిపి ముక్కు బ్రద్ద లవుతున్నట్లున్నా- నులకమంచం కుక్క దానిలా క్రిందకి ఒగబడి పోయున్నా- ఆ క్షణంలో ఆ మంచం, ఆ పాక, దాని ముందు ఆ రంగయ్య— ఆమెకు దేవుడు కోరకుండా యిచ్చిన వరంలా- పెట్టని కోటలా రక్షణగా కనిపించాయి!

బాబుని ఒళ్ళో పడుకోబెట్టుకుని ఆ మంచం మీద కూర్చున్న కమల మనస్సుకి ఒక గండం గడిచినంత రిలీఫ్ కలిగింది.

ఇంకా పాకముందు తొంగి తొంగి చూస్తూ ఏవో వేళాకోళా లాడుతున్నారు వాళ్ళు. ఒకడు బీడీలు కావాలన్నాడు. ఒకడు మరమరా లుండలు కావాలన్నాడు. ఇంకొకడు వేరుశనగపప్పు, మిఠాయి అడి గాడు. వేరొకడు నిమ్మ తొనలు యిమ్మన్నాడు. రంగయ్య బడ్డీ కొట్లో సాధారణంగా దొరికేవన్నీ వాళ్ళు వల్లె వేస్తున్నారు. అవి కొనే వంకన పాకలోకి వచ్చి 'ఆయమ్మ'ని కళ్ళారా చూడాలని వాళ్ళ తాప త్రయం.

వాళ్ళంతా పాకలోకి చొరబడితే తన గతేంకాను? రంగయ్య ఒక్కడు- ముసలివాడు. తననేం రక్షించగలడు? అరచేత ప్రాణాలు పట్టుక్కూర్చుంది కమల!

రంగయ్య వాళ్ళ మాటకి మాట అప్పగిస్తున్నాడు. ఏవీ అమ్మను పొమ్మన్నాడు. మంచీ మర్యాదాలేని మనుషులు మీర న్నాడు. 'ఆడకూతురు' కష్టాన్ని గ్రహించని కటిక వాళ్ళు మీ రన్నాడు. మీ మూలంగా ఊరికి చెడ్డపేరు వస్తుందన్నాడు.

ఆశ్చర్యపోయి అతని మాటలు వింటోంది కమల! మరుక్షణంలో ఏం జరుగుతుందో అంతుపట్టక ఊపిరి బిగపట్టి కూర్చుండి పోయింది.

అలా ఎంతసేపు గడిచిందో ఆమెకు తెలియదు. చంటివాడు లేచి ఏడుపు మొదలు పెట్టాడు. బయట వాళ్ళ మాటలు ఆగిపోయాయి. పాక ముందుకి అంతా తోసుకు వచ్చారు. రంగయ్య వాళ్ళవై పో సారి కోపంగా చూసి పాకలోపలికి వచ్చాడు. "బాబు కాకలేత్తుందేమో నమ్మా!" అన్నాడు.

కమల బిడియంగా యిబ్బందిగా చూసింది. ఆమె నోరు విప్పే దానికి ముందే, "ఉండమ్మా పాలు

తెప్పిస్తాను" అని పాక బయిటికి వెళ్ళాడు రంగయ్య. ఎవర్నో కేక పెట్టి పిలిచాడు.

తను తల తిప్పి అటు చూస్తే చాలు వాళ్ళు లోపలికి చొరబడి పోతారేమో నని భయపడుతోంది కమల. ఏడుస్తున్న బాబుని బుజ్జగిస్తూ అటు తిరిగి కూర్చుంది.

ఆమె వెన్ను మీద పరుచుకున్న పొడుగయిన జుట్టు చూస్తూ పాకముందు గుమిగూడిన వాళ్ళు గుసగుసలాడు కుంటున్నారు. వాళ్ళ బుర్రల్లో ఇంకా 'సినిమా స్టారు' డాన్సు చేస్తోనే ఉంది!

మరో ఐదు నిమిషాల్లో వేడి పాలు తీసుకు వచ్చాడు రంగయ్య. అప్పుడు కాని పాలసీసా కారులోనే వదలివేసానని కమలకి గుర్తు రాలేదు. ఏదీ వెంట తెచ్చుకోకుండా అక్కడికి వచ్చినందుకు తన్ను తాను లోలోపల తిట్టుకుంది.

రంగయ్య తన దగ్గరున్న సీవెండి చెంచా కడిగి తెచ్చాడు. పాలు ఎలా పోయాలో సలహా చెప్పాడు. తను పాలగ్లాసు పట్టుకున్నాడు. బాబును కాళ్ళమీద పడుకో బెట్టుకుని ఏడుస్తున్న వాడి నోట్లో ఒక్కొక్క చెంచాడు పాలు పోసింది కమల. అలవాటు లేక మొదట మారాము చేసినా, తాగిన పాలతో కొంత కడుపు నిండి ఏడ్పు మానేసాడు బాబు. మరి కాసేపటికి కేరింత లాడుతున్న బాబు నెత్తుకుని తనూ చిన్న పిల్లవాడై ఆటలాడాడు రంగయ్య!

తల దించుకు కూర్చున్న కమల మీద నుంచి పిల్లవాడి ఆటల మీదకి జనం దృష్టి మళ్ళింది! తెల్లని బాబు నెత్తుకున్నావ్- నీ నల్లరంగు అంటుకుంటుందేమో రంగయ్యా- అని ఒకడు, పెంచు కుంటా వేమిటని మరొకడు, బాబుతో పట్నం వెళ్ళిపోతావా యేమిటని ఇంకొకడు. వాళ్ళ మాటలు విని అంతవరకు అసహ్యంగా మాట్లాడిన వాళ్ళు వీళ్ళేనా అని ఆశ్చర్యపోయింది కమల!

ముందే చెప్పి వచ్చినట్టున్నాడు రంగయ్య- ఒక ముసల్ది చెంబుతో వేడివేడి పాలు తెచ్చింది. అరటి పళ్ళు, పాలు కమల ముందు పెట్టి "భోం చెయ్యమ్మా!" అన్నాడు రంగయ్య.

కమల ముఖం ఎర్రబడి పోయింది. "నాకాకలి లేదుబాబూ!" అంది వణికే కంఠంతో. 'సినిమా స్టారు' మొదటి సారిగా మాట్లాడిందని జనానికి పరమానంద మయి పోయింది!

"అయ్యో, అదేంటమ్మా! ఈ పూట అన్నం తిన్నేలేదు. ఇయ్యేనా తినమ్మా. మా వూళ్లో హోటేళ్ళు లెవుకందా!"

అతని మీద కృతజ్ఞతతో ఆమె గుండె నిండింది. కడుపు నిండి వుంది. నిజంగా ఏదీ తినాలనిలేదు ఆమెకు. ఆమె కళ్ళల్లోని తడిని గుర్తించినట్టున్నాడు రంగయ్య. "అల్లు పాడు మాటలన్నారని మన్సు కట్టపెట్టుకోమోకమ్మా! అల్ల తీరే అంత. కొంచె మెంగిలివడు"

బయట జనం వైపోసారి బెదురు బెదురుగా చూపింది కమల. "ఆయమ్మ సిగ్గు పడుతోంది. పొండిరా!" అంటూ గొర్రెల మందని తోలుకు పోయే కాపరిలా చేతులూపుతూ వాళ్ళని తోసుకుంటూ బయటకు వెళ్ళాడు రంగయ్య.

నిజంగా ఆమె సిగ్గు పడుతోందని గ్రహించి తగ్గిపోయారో, అప్పటికిక 'సినిమా స్టారు' మీద మోజు తగ్గి వెనకడుగు వేసారో, రంగయ్య మందలింపు మాటలు వాళ్ళ మీదపనిచేసాయో, అతని చేతుల్లో రబ్బరు బొమ్మలా ఆడుతున్న బాబుని చూపి మురిసిపోయి మర్చి పోయారో, లేక రంగయ్య అన్నట్లు వాళ్ళ మాట తీరే అంతో కమలకు అంతుపట్టలేదు.

వాళ్ళు దూరంగా వెళ్ళిపోయే సరికి ఆమెకు కొంచెం ఊపిరి సలిపినట్టయింది. ఏమీ తినాలని లేకపోయినా కేవలం రంగయ్యని నొప్పించకూడదని ఓ పండు తిని కొంచెం పాలు త్రాగింది.

నిద్ర పోయిన బాబును తీసుకు వచ్చి ఆమె కందించాడురంగయ్య. తన పాత దుప్పటి తెచ్చిచ్చి "మెత్త గుంటది, బాబుకి పక్కేయ్యమ్మా!" అన్నాడు.

అతనేం చెపుతున్నా మాట్లాడలేని స్థితిలో వుంది కమల. తన వేనిటీ బ్యాగ్‌లో వందలున్నాయి. పట్నంలో వున్నప్పుడు తను కోరుకుంటే పంచభక్ష పర్వాన్నాలూ, హంస తూలికా తల్పాలు క్షణాల్లో వచ్చి పడతాయి. కాని, ఇక్కడ ఇప్పుడు ఎంత డబ్బు పెట్టినా ఎవరయినా ఇటువంటి ఆశ్రయం ఇప్పించగలరా? తను కోరకుండానే తన నిస్సహాయ స్థితిని గుర్తించి ఈ ముసలి వాడు ఇంత చేస్తున్నాడు! కళ్ళెట్టుకు చూడాలి. కల్సి రావాలి- ఈ లోకంలో చాలా చాలా మంచి వాళ్ళున్నారు. బహుశ, అందుకే ఇంకా ఇది అంతం కాకుండా నిలబడగలిగిందేమో!

"నువ్వు కూడా కుసింత కునుకు తియ్యమ్మా! తెల్లారేతలికి అయ్యో

చ్చేస్తాడు. మరేం బయం లేదు." అని కూడా ధైర్యం చెప్పాడు రంగయ్య.

కాని, కమలకి ఎంత సేపటికీ నిద్ర పట్టలేదు. అలవాటు లేని పక్క, మధ్య మధ్య పక్కనున్న గుడిసెల్లోంచి వినిపించే తాగు మోతు వాళ్ళ పిచ్చి కేకలు, బయట కీచురాళ్ళ మోత, ఎక్కడ్నించో ఉండుండి వినిపించే నక్కల కూతలు, కుక్కల అరుపులు, అడపా తడపా రోడ్ మీద రంయ్‌మని చప్పుడు చేసుకుంటూ పోయే లారీల హడావిడి- ఇవేవీ కాదు ఆమెకు నిద్ర పట్టక పోవటానికి కారణం!

'హఠాత్తుగా ఇంత చిమ్మ చీకటిలో చిక్కుకు పోయిన తనకు ఈ చిన్న దీపమే కనిపించి ఉండక పోతే తానీ పాటికి ఏమై వుండేది?' అన్న ఆలోచన భయపెడుతోంది. అక్కడ భర్త ఏం అవస్తలు పడు తున్నాడో అన్న ఆలోచన బాధ పెడుతోంది.

తెల తెలవారుతున్నా ఆమెకు నిద్రన్నది రాలేదు.

ఏదో కారు ఆగినచప్పుడు. 'ఇది రామవరమేనా' అని ఎవర్నో అడుగు తున్న శ్యాంసుందర్ గొంతు కమలకి వినిపించాయి. ఒక్క పరుగులో పాక బయిటికి వచ్చింది. అప్పటికే ట్రావెలర్స్ బంగళా వైపు కారుని బయలుదేర తీసాడు శ్యాంసుందర్. కాని, ఎవరో కారు వైపు పరిగెత్తి వస్తున్నట్టనిపించి వెనక్కి తిరిగి చూసాడు. ఆ మసక వెలుతురులో కూడా తన భార్యని గుర్తించాడు! చటుక్కున కారు ఆపి, రివర్స్ చేసి పాక దగ్గరికి వచ్చాడు.

ట్రావెలర్స్ బంగళాలో ఉండ వల్సిన భార్య యిక్కడ యెందు కుందో అర్థంకాక తెల్లబోతూ కారు దిగి వచ్చాడు శ్యాంసుందర్. అతను కురిపించిన ప్రశ్నల వర్షానికి తట్టుకోలేక పోయింది కమల. రాత్రంతా నిద్రలేక అలిసిపోయి వుంది. భయపెట్టిన ఆలోచనలతో కదలిపోయి వుంది.

తెల్లవారుతోంది. వెలుగు వస్తోంది. భర్త కనిపించాడు. గండం గడిచిపోయింది. ఒక్క సారిగా రిలీఫ్ కలిగేసరికి ఆమె తట్టుకోలేక పోయింది. రాత్రి భయంతో, బాధతో రాలేకపోయిన కన్నీళ్ళు ఒక్కసారిగా కలిగిన ఆనందంలో పొంగి వచ్చేశాయి. గబుక్కున కారుదోరు తెరుచుకుని వెనక సీట్లో కూర్చుని చేతులతో ముఖం కప్పుకుంది కమల!

అప్పటికే లేచిన రంగయ్య

చంటివాడిని లేవనెత్తుకు వచ్చాడు. శ్యాంసుందర్ చేతుల కందించాడు. బంగళా గురించి చెప్పాడు— "....ఆయమ్మ రేత్రి యీడనే వుందయ్యా!" అన్నాడు.

పిల్లవాడ్ని కమల పక్కనే పడుకోబెట్టాడు శ్యాంసుందర్.

మళ్ళీ లోపలికివెళ్ళి కమల వేనిటీ బ్యాగా తెచ్చిచ్చి "అన్నం తిన్లేదు. పక్క సర్లేదు. రేత్రి అమ్మకి నిద్రట్టలేదు" అన్నాడు రంగయ్య.

భార్యకి కలిగిన యిబ్బందికి చాలా బాధపడ్డాడు శ్యాంసుందర్. ఆమెను దగ్గరికి తీసుకుని ఓదార్చాలని వుంది. కాని, అప్పటికే కారు దగ్గర జనం చేరి సోద్యం చూస్తున్నారు. అందుకని కారు స్టార్టుచేసి వేగంగా పోనిచ్చాడతను.

కమల చటుక్కున తలయెత్తి చూసింది. "ఏమండీ! ఎక్కడికి! ఆపండి!" అని కేక పెట్టింది.

అప్పటికే కారు రెండు ఫర్లాంగుల దూరం వచ్చేసింది. కారునాపి "సారీ కమలా! రాత్రి నువ్వలాంటి పాకలో పడివుండాల్సి వస్తుందని నేననుకోలేదు." అన్నాడు.

"నేనక్కడ ఉన్నందుకు బాధ పడటం లేదండీ! ఎంతో సంతోష పడుతున్నాను"

అతనుతెల్లబోయాడు.

"నిజం!.... నేనేడుస్తున్నానని కంగారు పడుతున్నారా?...." అని కన్నీళ్ళతోనే నవ్వింది కమల.

పట్టణంలో చీకటన్నది ఉండదు. పెద్దపెద్ద దీపాలుంటాయి. పోలీసులు గస్తీ తిరుగుతారు. అయినా, ఆ రాత్రి అక్కడ తానొంటరిగా వుండుంటే రక్షణ దొరికి వుండేదా? దుండగుల బారి నుంచి తప్పించుకొన గలిగేదా? కావి, గతరాత్రి వెలిగిన దీపం చిన్నదే అయినా ఆ చిమ్మ చీకటిలో ఎంత వెలుగు ప్రసాదించింది! ఎంత రక్షణ నిచ్చింది!

ముక్కు ముఖం తెలియని మనిషికోసం రాత్రి తన యిరుగు పొరుగుతో ఘర్షణ పడ్డాడు. ఒక్క రాత్రి ఉండిపోయే దానికోసం నిత్యం కల్సి వుండేవాళ్ళతో తగవు పడ్డాడు. ఒక అసహాయురాలికి అండగా నిలవటానికని తన వ్యాపారాన్నేరాత్రి మానుకున్నాడు. ఇటువంటిమంచిమనిషి మాటకికాకపోతే మరి దేనికి శక్తివుంటుంది!

ఆనందంతో వస్తున్నవి ఈ కన్నీళ్ళు. ఒక్కసారిగా దొరికిన ఓదార్పుకి అవి పొంగివస్తున్నాయి!

భార్య చెప్తున్న మాటలు విని

ఎంతో ఆశ్చర్య పోతున్నాడు శ్యాం సుందర్.

"మిమ్మల్ని చూసిన ఆనందంలో నేను మతిలేని దానిలా ఏడుస్తూ కూర్చున్నాను. అతనికి థాంక్స యినా చెప్పలేదు. పదండి వెడదాం!" అంది కమల కళ్ళు తుడుచుకుంటూ.

మళ్ళీ తిరిగి వచ్చిన కారుని చూసి తెల్లబోయి చూసాడు రంగయ్య. కారుదిగి వచ్చిన భార్యా భర్తల్ని చూసి "ఏం బాబూ! ఏటన్నా మర్చిపోయారా?" అని వెతకటాని కన్నట్టు పాక లోపలికి వెళ్ళబోయాడు.

శ్యాంసుందర్ నవ్వాడు. "ఏమీ మర్చిపోలేదు. నువ్వు రాత్రి చేసిన సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలే మని చెప్పటానికి వచ్చాము."

"ఇదీ ఓ పెద్ద సాయమేనా బాబూ!" అన్నాడు రంగయ్య వినయంగా, బిడియంగా.

తన బ్యాగ్ తెరిచి ఓ వంద రూపాయల నోటు తీసి రంగయ్య కందిస్తూ "నువ్వు చేసిన దానికి నేనెంత యిచ్చినా నీ ఋణం తీర్చు కోలేను బాబూ! నా సంతోషం కోసం యిది తీసుకో!" అంది.

రంగయ్య తెల్లబోయాడు. "అయ్యో! ఎంత మాటమ్మా! నా కూతురే నా యింటికొస్తే కాలు సాచుకోటానికి కాస్త నోటియ్యనా? నానేం చేసానని! అన్నమేనా పెట్ట లేదే. ఇంతడబ్బు నా కెందుకు? వద్దమ్మా వద్దు."

'నువ్వెంత చేసావో మాటలతో చెప్పగలిగేదా రంగయ్యా' అని అడుగుతున్నాయి నీళ్ళు నిండిన ఆమె కళ్ళు. అది గుర్తించాడు శ్యాంసుందర్. "కమల నాకంతా చెప్పింది. నువ్వు చేసిన సాయం చాలా గొప్పది. డబ్బుతో లెక్క కడుతున్నా మనుకోకు! మా తృప్తి కోసం తీసుకో రంగయ్యా!"

రంగయ్య కళ్ళు చెమర్చాయి. "సూడండి బాబూ! మా అమ్మమ్మకి బెజ్వాడ దుర్గమ్మ కల్లో కనిపిత్తాందే దంట! రేత్రి యీ యమ్మ నా పాక కాడ కనిపించేతలికి ఆయమ్మే వచ్చి నిల్చుందనుకున్నా నయ్యా!"

ఎంత గొప్ప భావన! మామూలుగా కనిపించే మనిషి-మనుష్యుల్లో దేవతల్ని చూస్తూన్న మనీషి!

"ఒక్క రేత్రి నా పాకలో అమ్మోరు కూసుని ఎల్లిందనుకుంటా. నాకంతేసాలు బాబూ!" అనిచేతులెత్తి దణ్ణం పెట్టాడు రంగయ్య.

కమలా శ్యాంసుందర్లు అవాక్కయి పోయారు! •